క్లుప్తంగా

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



జి.కొండూరు: మండలంలోని వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగపరచుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు.

శ్రీరాముడికి అభిషేకం

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో 19వ రోజు బుధవారం దేవతామూర్తులకు అభిషేకం కనులవిందుగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో సీతారాములు, లక్ష్మణుడు ఆంజనేయస్వామి మూల విరాట్ విగ్రహాలకు నవ ఫలరసాలతో, పంచామృతాలతోనూ అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ కోదండరాం, భక్తులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ



గంపలగూడెం: దాతల సహకారంతో పాఠశాల లైబ్రరీలో అందుబాటులో ఉంచిన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగపరచుకుని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి. కిరణ్ తెలిపారు. పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న చిమట సురేష్‌బాబు తన తాతా స్వర్గీయ చిమట సోమయ్య జ్ఞాపకార్థం రూ.72వేల విలువైన పుస్తకాలను పాఠశాల లైబ్రరీకి వితరణగా అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమున్న పుస్తకాలను దాత అందజేశారని పేర్కొన్నారు. దాత సురేష్‌కు శాలువా కప్పి ఉపాధ్యాయులు సన్మానించారు. హైస్కూల్ హెచ్ఎం కృష్టాఫర్, ఉపాధ్యాయులు చంద్రం, మురళీ, పీఈటీ గోపాలరావు, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్లు అందజేత



మైలవరం: స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సినీ నిర్మాత, మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్(మోస్ట్) జనరల్ సెక్రటరీ, బాపూజీ బోర్డ్ హైస్కూల్ పూర్వ విద్యార్థి జవ్వాజి వెంకటరామారావు తన సొంత నిధులతో మూడు కంప్యూటర్లు ఒకేషనల్ విభాగానికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరళకుమారి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా ముగ్గురమ్మల జాతర



దొనబండ(ఇబ్రహీంపట్నం): భక్తుల ఇలవేల్పుగా వెలుగొందుతున్న సత్తెమ్మ, మారెమ్మ, కాళియమ్మ (ముగ్గురమ్మల) ఆలయం జాతర దొనబండ గ్రామంలో బుధవారం కనులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ముగ్గురమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. భక్తులు వీపులకు శూలాలు గుచ్చుకుని కారును లాగి భక్తిని చాటారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే వసంత ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ముగ్గురమ్మల ఆలయం సందర్శించారు. ముగ్గురమ్మలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచ్ డి.రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, దుర్గాప్రసాద్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ముసునూరు: కోడిపందేలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కుటుంబరావు హెచ్చరించారు. కోడి కత్తుల తయారీ విక్రయాలపై ఆయన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై అల్లూరయ్య, కోడికత్తుల తయారీదారులపై లోపూడి శివారు బాసవరప్పాడులో బుధవారం సోదాలు చేశారు. ఈ సోదాలో కోసూరి శివకృష్ణ వద్ద 139 కత్తులు లభించాయి. కత్తులను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షేమ పథకాల అమల్లో దేశానికి ఏపీ ఆదర్శం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



కొండపల్లిలో పెంచిన రూ.3వేల పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లిలో ప్రభుత్వం పెంచిన రూ.3వేలు సామాజిక పింఛన్‌లు బుధవారం లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కొండపల్లి మున్సిపాల్టీ 6,264మంది లబ్దిదారులకు ప్రతినెలా రూ.1,87,92,000ను వలంటీర్ల ద్వారా నేరుగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొండపల్లి అభివృద్ధికి కృషి

కొండపల్లి మున్సిపాల్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ తెలిపారు. ఇప్పటికే మూడు వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.55 కోట్లు ఇంటింటి కుళాయికి మంజూరు అయిందన్నారు. టెండర్ దశలో ఉందన్నారు. డ్రెయినేజీ నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేశామని, మరో రూ.3కోట్లు ఎన్టీటీపీఎస్ నుంచి విడుదల కావాల్సి ఉందన్నారు. ఎన్టీటీపీఎస్ కార్మికుల క్రమబద్ధీకరణ సీఎంఓ దృష్టిలో ఉందని, మరికొన్ని అభివృద్ధి పనుల నిధులు వ్యవహారం సైతం సీఎంవో పరిశీలిస్తుందని వెల్లడించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

తిరువూరు: తిరువూరు మండలంలో కొత్త, పెరిగిన పింఛన్ల సొమ్ము లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి పలువురు వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు పెన్షన్ సొమ్మును అందజేశారు. వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్ష ఉపాధ్యక్షులు చలమాల సత్యనారాయణ, రాజ్‌మహ్మద్, నాగుల్‌మీరా, పార్టీ నాయకులు గత్తం నాగేశ్వరరావు, వేణుబాబు పాల్గొన్నారు. తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటనరసమ్మ, గద్దె కృష్ణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు కొత్త పింఛన్లను పంపిణీ చేశారు.



మైలవరంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



తిరువూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి తదితరులు

మైలవరంలో..

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక భద్రతా పింఛన్ సొమ్ము పెంపుతో అవ్వాతాతలు, వితంతువుల్లో ఆనందం వెల్లివిరిసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ ఎస్ కల్యాణ మండపంలో బుధవారం లబ్దిదారులకు ఎమ్మెల్యే వసంత పింఛన్‌లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎక్కువ మందికి అధిక మొత్తంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇదొక చరిత్ర అని అన్నారు.

దేశంలోనే అత్యధిక పింఛన్ ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్



నూజివీడులో పింఛన్‌దారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా అత్యధిక పింఛన్ మొత్తాన్ని ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమైందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పింఛన్‌దారులకు వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలను బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పింఛన్‌దారులకు పెరిగిన రూ.3 వేల పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని వందశాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సూర్యోదయం సమయానికే వలంటీర్ల ద్వారా పింఛన్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు.

కిలో బంగారం ఇస్తామంటారూ.. జాగ్రత్త

చంద్రబాబుతో పాటు టీడీపీ నాయకులు కిలో బంగారం ఇస్తాం ఓటేయండంటూ మభ్య పెట్టాలని చూస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు హెచ్చరించారు. ఇప్పటికే టీడీపీ నాయకులు అమలు గాని వాగ్దానాలు చేస్తున్నారని, ప్రజలు ఎవరూ వాటిని నమ్మడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకొని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఎం దయాల రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు అశోక్, కాసులు, వెంకటేశ్వరరావు, కృష్ణ, రాఘవ, లెనిన్, నాని పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



తిరువూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ల పంపిణీ

తిరువూరు: స్థానిక 14, 15 వార్డు సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం రెండో విడత నిర్వహించారు. వార్డు పరిధిలోని రోగులకు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన రోగులకు వైద్యపరీక్షలు చేసిన వైద్యాధికారులు వారికి తగు సలహాలు, సూచనలిచ్చారు. వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, షేక్ గుంటూరు మస్తాన్, కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ల పర్యవేక్షణలో రేషన్ బియ్యం పంపిణీ



గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రేషన్ బియ్యాన్ని వలంటీర్ల పర్యవేక్షణలో పంపిణీ కార్యక్రమాన్ని గంపలగూడెం మండలంలో బుధవారం అధికారులు చేపట్టారు. ఇకపై ఎండీయూ వాహనం వెంట వలంటీర్ ఉండి కార్డుదారులకు బియ్యం, ఇతర సరుకులను పంపిణీ చేస్తారని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, తిరువూరు పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. కార్డుదారులు సంబంధిత సరుకులను ఈనెల 15వ తేదీలోపు తీసుకోవాలన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



ఇబ్రహీంపట్నంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న, బీసీ విద్యుత్ సంఘం నాయకులు



విస్సన్నపేటలో ప్రసంగిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

విస్సన్నపేట: గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయిపూలే అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కొండా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

తోటమూల(గంపలగూడెం): సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తోటమూల సరస్వతి విద్యాలయంలో మహిళా ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయిని తాళ్లూరి లిల్లీ పుష్ప ఆధ్వర్యంలో పాఠశాలలోని ఎనిమిది మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

పెద్దకొమిర(గంపలగూడెం): జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గంపలగూడెం మండలం పెద్దకొమిర దళితవాడ ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మిరియాల విజయలక్ష్మిని సన్మానించారు. ఉపాధ్యాయులు కే వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: సంఘ సంస్కర్త తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళల అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సావిత్రిబాయిపూలే జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీసీ ఇన్‌చార్జి డాక్టర్ పి.శోభారాణి, సహేలీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. అలాగే మైలవరం మోడల్ స్కూల్లో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. పీఆర్‌టీయూ కార్యవర్గం అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ యూనియన్ నాయకులతో కలసి ఆమె పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు.

సచివాలయ భవనం ప్రారంభం



వట్టిగుడిపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని వట్టిగుడిపాడులో బుధవారం ఎమ్మెల్యే రూ.28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ప్రజలు వారి సమస్యలపై ప్రభుత్వ కార్యాలయల చుట్టూ తిరుగుతూ పడిగాపులు పడేవారని, వారి అవస్థలను గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలన అందించారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు పాల్గొన్నారు.


గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రికెట్ విజేత దిగవల్లి కండ్రిక జట్టుకు బహుమతిని అందజేసిన ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లి హైస్కూల్లో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



జి.కొండూరు మండలం వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ప్రతిభ చూపే క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని దిగవల్లిలో నిర్వహిస్తున్న దిగవల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. విజేతగా దిగవల్లి కండ్రిక జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో నూజివీడు జట్టు నిలిచింది. విజేతలకు బహుమతి పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ విజేతగా నిలిచిన దిగవల్లి కండ్రిక జట్టుకు రూ.20 వేలను ప్రకటించి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే టోర్నమెంట్‌లు గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కెత్తే కొండలరావు(నాని), వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు కోపూరి సుధాకర్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలో మర్లపాలెం, చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన ఖోఖో ఆటల పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు.

క్రికెట్ పోటీలకు 128మంది క్రీడాకారులు

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలంలో వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మండలంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో తొమ్మిదో రోజు బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఎనిమిది జట్లు పోటీపడగా 128 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపీడీఓ అనురాధ మాట్లాడుతూ క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు.

ముమ్మరంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

ఏ.కొండూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంలో రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని చీమలపాడు, కంభంపాడు, ఏ.కొండూరు, రామచంద్రాపురం, కోడూరు పలు గ్రామాల సచివాలయాల పరిధిలో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వించారు. 20 క్రికెట్ టీములు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు క్రికెట్ పోటీలు జరుగుతాయని ఎంఈఓ ఈ కేశవరరావు తెలిపారు.

ముసునూరులో..

ముసునూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడలతో పల్లె యువతలో ఉల్లాసం, ఉత్సాహం రెట్టింపయ్యాయని హెచ్ఎం సునీల అన్నారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ముసునూరు హైస్కూల్‌లోని క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను బుధవారం ఆమె సందర్శించారు. ఈనెల 10వ తేదీ నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని పీడీ ఆలీ తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వడ్లమాను సచివాలయ పరిధిలో బుధవారం షటిల్ పోటీలు నిర్వహించారు. సచివాలయ కార్యదర్శులు మిర్జావలి, వెంకన్న బాబు, పీడీ నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ ఆయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

చాట్రాయి: ఆయోధ్య రామాలయం నుంచి తరలి వచ్చిన అక్షింతలను మండలంలోని చిన్నంపేట గ్రామంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్షింతలను మేళతాళాలతో గ్రామంలో జై శ్రీరాం అంటూ భక్తులు ఊరేగించారు.

■ ఎస్టీయూ కార్యవర్గం ఏర్పాటు

చాట్రాయి: మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా వెదుళ్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి భరత్ దివ్యకాంత్, గౌరవ అధ్యక్షుడిగా డి నాగేశ్వరరావు, కౌన్సిలర్లుగా జి.రాము, జి.అమరయ్య, ఎస్‌కే మహబ్, ఎస్ రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

■ నూజివీడు మండలానికి 139 నూతన పింఛన్ల మంజూరు

నూజివీడు: మండలంలో అర్హత కలిగిన వారికి నూతనంగా 139 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి సంబంధించిన మొత్తం రూ.4.17 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో వీరంతా ఇక నుంచి ప్రతినెలా రూ.3వేలు చొప్పున అందుకోనున్నారు.

నూజివీడు మండలంలో 8,311 పింఛన్లు

మండలంలో మొత్తం 8,311 పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోంది. దీనికి గాను ప్రతి నెలా ప్రభుత్వం రూ.2.44కోట్లను పింఛన్ల నిమిత్తం విడుదల చేస్తోంది.

■ స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 160 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనకుమారి, పార్టీ నాయకులు గోళ్ల ఇస్సాకు, ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, హెచ్ఎం పుష్పలత, పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

■ విద్యుదాఘాతంతో గృహాల దగ్ధం

ముసునూరు: విద్యుదాఘాతానికి గురై గుళ్లపూడి దళితవాడలో యల్లమెల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావులకు చెందిన నివాసగృహాలు బుధవారం దగ్ధమయ్యాయి. నూజివీడు అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లో ఉన్న కొంత నగదు కూడా అగ్నికి ఆహుతైంది. ఆస్తి నష్టం రూ.2 లక్షల వరకు ఉండవచ్చని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ దాసరి సుధ ప్రమాద కారణాలు తెలుసుకుని, బాధిత కుటుంబాలకు 25 కేజీల చొప్పున మొత్తం 50 కేజీల బియ్యం తక్షణ సాయంగా అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వంట సామగ్రి అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు వీఆర్‌ఓ నవీన్‌బాబు తెలిపారు.

■ సామాజిక భవన నిర్మాణం పనులు పూర్తి చేయాలి

మైలవరం: త్వరితగతిన సామాజిక భవన నిర్మాణం పనులు పూర్తి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం ఎస్సీ ఏరియాలో రూ.75 లక్షల అంచనాలతో నిర్మాణ దశలో ఉన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ రూ.50 లక్షలు మంజూరు చేయగా మరో రూ.25 లక్షలు డీఎంఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

■ రేషన్ దుకాణంలో 55 క్వింటాళ్ల బియ్యం తరుగు

గంపలగూడెం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రాత్రి గంపలగూడెంలో రేషన్ దుకాణాలపై దాడి చేశారు. స్థానిక డీలర్ అమిత్‌ఖాన్(బాజి)కి చెందిన 32వ నంబర్ రేషన్ దుకాణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కే నాగేశ్వరరావు, తిరువూరు పీడీఎస్ డీటీ నాగరాజు, సిబ్బంది దుకాణంలోస్టాక్ పరిశీలించారు. రికార్డు ప్రకారం 94 క్వింటాళ్ల బియ్యం దుకాణంలో నిల్వ ఉండాల్సి ఉండగా, 39 క్వింటాళ్లు మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దీంతో 55 క్వింటాళ్ల బియ్యం తరుగును నిర్ధారించి కేసును నమోదు చేశారు. సంబంధిత డీలర్ రెండు రేషన్ దుకాణాలను నిర్వహిస్తుండగా 32వ నంబర్ దుకాణాన్ని పెద్దకొమిర సొసైటీకి, 34వ నంబర్ దుకాణాన్ని బాబుల్‌రెడ్డికి స్వాధీనపరిచినట్లు నాగరాజు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంపలగూడెం మండలం సొబ్బాలలో ఒక కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ ఉన్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు దాడి చేసి స్వాధీన పరచుకున్నారు. గ్రామానికి చెందిన వెంకట సత్యనారాయణ కోళ్లఫారంలో తనిఖీ చేయగా సంబంధిత రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు.

■ ట్యాంకర్ నుంచి వెలువడుతున్న లిక్విడ్

జూపూడి(ఇబ్రహీంపట్నం): 65వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్యాంకర్ నుంచి ఆవిరి రూపంలో లిక్విడ్ వెలువడుతోంది. లిక్విడ్ ఆవిరితో రోడ్డుపై వెళుతున్న వారి కళ్లు మంటలు రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వస్తున్న లిక్విడ్ ట్యాంకర్ బుధవారం తెల్లవారుజామున ముందువైపు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వెనుక భాగంలో ఢీకొట్టింది. లారీ ముందు భాగం ఎడమ వైపు పూర్తిగా ధ్వంసం అయింది. డ్రైవర్ లారీని రోడ్డు పక్కన నిలిపి వెళ్లాడు. ఆవిరిని చూసిన వారికి కళ్లు మంటలు రావడంతో ఆందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు లారీని అక్కడి నుంచి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

■ నేడు పింఛను పంపిణీ

విస్సన్నపేట: ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి చేతుల మీదుగా పింఛను పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉదయం 10 గంటలకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పైడూరుపాడు గ్రామంలో..

పైడూరుపాడు(విజయవాడరూరల్): పింఛన్ల పంపిణీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేతుల మీదుగా గురువారం ఉదయం 10.30 గంటలకు పైడూరుపాడు గ్రామంలో నిర్వహించనున్నట్లు విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రూ.2,750 నుంచి రూ.3వేలకు పింఛను పెంచిన నేపథ్యంలో గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు పైడూరుపాడు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నల్లతామర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

ఊటుకూరు/కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలంలో సాగు చేసిన మిరపలో ప్రస్తుతం కన్పిస్తున్న నల్లతామర పురుగు నివారణకు రైతాంగం తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలని తిరువూరు ఉద్యానవన శాఖ అధికారి సోహెల్ అహ్మద్ తెలిపారు. ఆయన బుధవారం గంపలగూడెం మండలం ఊటుకూరు, కొణిజెర్ల గ్రామాల్లో మిరప తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలిచ్చారు. సమగ్ర సస్యరక్షణ చర్యలలో భాగంగా రైతాంగా సామూహిక నీలిరంగు జిగురు అట్టలపై ఎకరానికి 50 వరకు మొక్క ఎత్తులో ఏర్పాటు చేసుకోవడం ద్వారా తల్లి పురుగును నివారించవచ్చన్నారు. తామర పురుగు నివారణకు సూచనలు చేస్తూ ముద్రించిన కరపత్రాలను రైతులకు అందజేశారు. వ్యవసాయ సహాయకులు సదాశివపాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

తిరువూరు: రిటైర్డు ప్రభుత్వోద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను తప్పక సమర్పించాలని ఉప ఖజానా అధికారి ఎండీ అర్షద్ ఉమర్ తెలిపారు. రిటైర్డు ఉద్యోగులందరూ ఫిబ్రవరి 29వ తేదీ లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించకపోతే మార్చి నెల పెన్షన్ నిలిపి వేస్తామని పేర్కొన్నారు. ఉపఖజానా కార్యాలయం, మీసేవా కేంద్రాలలో ఈ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చని తెలిపారు.